కొండ చరియలు విరిగిన చోట సహాయక చర్యలు చేపట్టిన సైన్యం

విరిగిపడ్డ కొండచరియలు..
ముగ్గురు జవాన్లు మృతి

మరో ఆరుగురు గల్లంతు ▪ సిక్కింలో దుర్ఘటన

గ్యాంగ్‌టక్, జూన్ 2: సిక్కింలోని చాతెన్ మిలటరీ క్యాంప్‌పై కొండచరియలు విరిగి పడిన ఘటనలో ముగ్గురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు సైనికులు గల్లంతయ్యారని రక్షణ శాఖ అధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. మంగన్ జిల్లా లాచెన్ పట్టణం సమీపంలో భారీ వర్షాల కారణంగా ఆదివారం సాయంత్రం ఈ ఘటన సంభవించిట్టు తెలిపారు. మృతుల కుటుంబాలకు సైన్యం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చిందని రక్షణ అధికారి తెలిపారు. 'ఈ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇక్కడి సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడి, హవల్దార్ లఖ్వీందర్ సింగ్, లాన్స్ నాయక్ మునీశ్ ఠాకూర్, పోర్టర్ అభిషేక్ లఖాడ ప్రాణాలు కోల్పోయారు' అని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సిబ్బంది మృతదేహాలను వెలికితీశామని, మరో నలుగురు సైనికులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారని సదరు అధికారి చెప్పారు. కనిపించకుండా పోయిన ఆరుగురు సైనికులను గుర్తించడానికి రెస్క్యూ బృందాలు 24 గంటలూ పనిచేస్తున్నాయని తెలిపారు.

పూర్ పబ్లిక్ డిప్లామసీ

▪ సీడీఎస్ చౌహాన్ అలా మాట్లాడటమేంటి?

▪ జియోస్ట్రాటజిస్ట్ బ్రహ్మ చెల్లానీ విమర్శలు

న్యూఢిల్లీ, జూన్ 2: ఆపరేషన్ సిందూర్ తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రచార వ్యూహాన్ని జియోస్ట్రాటజిస్ట్ బ్రహ్మ చెల్లానీ తప్పుపట్టారు. పాకిస్థాన్‌తో ఇటీవల జరిగిన సైనిక ఘర్షణలో భారతీయ యుద్ధ విమానాలకు నష్టం జరిగినట్లు భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) అనిల్ చౌహాన్ సింగపూర్ సదస్సులో అంగీకరించడాన్ని 'పూర్ పబ్లిక్ డిప్లామసీ (పేలవమైన దౌత్యం)' అని ఆయన అభివర్ణించారు. సింగపూర్‌లో జరిగిన సమావేశానికి సీడీఎస్‌ని మోదీ ప్రభుత్వం అనవసరంగా పంపిందన్నారు. భారత్ యుద్ధ విమానాలను నష్టపోయినట్లు రాయిటర్స్ ఇంటర్వ్యూలో సీడీఎస్ అంగీకరించి, పాకిస్థాన్‌కు ప్రచార విజయాన్ని అందచేశారని సోమవారం ఎక్స్ వేదికగా చెల్లానీ విమర్శించారు. ఈ సైనిక ఘర్షణలో పాకిస్థాన్‌కు చేసిన నష్టాన్ని కూడా లెక్కలతో సహా వివరించి భారత గడ్డపై నుంచి అటువంటి ఒప్పుకోలు ప్రకటన చేసి ఉండవచ్చని బ్రహ్మ చెల్లానీ వ్యాఖ్యానించారు. సీడీఎస్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యలు చేసిన సమయం, సందర్భాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ కూడా హాజరైన సింగపూర్ వేదిక భారత్, పాక్‌ను ఒకే గాటన కట్టడానికి తోడ్పడిందని ఆయన వ్యాఖ్యానించారు.

మోదీ దౌత్యం.. విఫలం!

- ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌ను ప్రపంచం ఎదుట దోషిగా నిలబెట్టడంలో కేంద్రం విఫలం
- పహల్గాం ఘటనపై మిత్ర దేశాల మద్దతు కూడగట్టడంలో ప్రధాని నరేంద్ర మోదీ వైఫల్యం
- 11 ఏండ్ల పాలనలో దిగజారిన మనదేశ విదేశీ సంబంధాలు
- శత్రువులుగా మారుతున్న ఒకప్పటి 'పారుగు' మిత్రులు

పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన తన భర్త వద్ద విలపిస్తున్న నవ వధువు (ఫైల్)

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడికి కారణమై, ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెడతామని మోదీ ప్రభుత్వం ప్రతినబూనింది. అయితే, ఆ వాగ్దానాలు మాటలకే పరిమితమయ్యాయి గానీ, కార్యరూపం దాల్చలేదు. మిగతా దేశాల విషయం అటుంచితే, పాక్‌కు వ్యతిరేకంగా మిత్ర దేశాల మద్దతును కూడా ఎన్డీయే ప్రభుత్వం కూడగట్టలేకపోయింది. మరోవైపు, ఇంతకాలం మిత్రులుగా ఉన్న పొరుగు దేశాలు కూడా చైనా చక్రబంధంలో చిక్కుకొని భారత్‌కు క్రమంగా దూరమవుతున్నాయి. ఇలా మొత్తంగా 11 ఏండ్ల పాలనలో విదేశాంగ విధానంలో, విదేశీ దౌత్యంలో మోదీ ప్రభుత్వం విఫలమయ్యిందన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆప్త మిత్రుడైనప్పటికీ ఆపలేదు

భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై అమెరికా తొలి నుంచీ భిన్న వైఖరిని అవలంబించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త తల్లో తాము జోక్యం చేసుకోబోమని తొలుత అమెరికా చెప్పుకొచ్చింది. అయితే, 24 గంటలు తిరక్కముందే.. భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు తాను మధ్యవర్తిత్వం వహించానని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. విరమణకు సంబంధించిన ప్రకటన చేస్తూ.. పాక్‌ను, భారత్‌ను ట్రంప్ ఒకేగాటిన కట్టడంతో పాటు ఇరుదేశాలను ఉద్దేశించి 'కామన్‌సెన్స్' అనే వ్యాఖ్యలను చేశారు. ట్రంప్‌ను తన ఆప్తమిత్రుడిగా చెప్పుకొనే మోదీ.. ఈ విషయంపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అమెరికా వైఖరిని ప్రశ్నించలేదు. ఇవన్నీ విశ్లేషిస్తే, పాక్‌ను దోషిగా నిలబెట్టే విషయంలో అమెరికా సాయాన్ని తీసుకోవడంలో మోదీ దౌత్యం ఏమీ పనిచేయలేదని విశ్లేషకులు చెప్తున్నారు. ఇక, ఆర్థిక, ఆహార, రాజకీయ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ బెయిల్ అవుట్ ప్యాకేజీ దక్కకుండా అడ్డుకోవడం లోనూ మోదీ ప్రభుత్వం విఫలమైంది.

యూఏఈ ఇలా.. కొలంబియా అలా..

యూఏఈ, భారత్‌కు మధ్య దశాబ్దాలుగా మంచి దౌత్య సంబంధాలు ఉన్నాయి. అయితే, పహల్గాం దాడులు జరిగిన సమయంలోనే యూఏఈ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జయాద్ పాకిస్థాన్‌లో పర్యటించడం అందరినీ షాక్‌కు గురిచేసింది. అంతేకాదు, ఇరు దేశాలు ఉద్రిక్తతలకు పాల్పడకుండా శాంతి చర్చలు చేపట్టాలని యూఏఈ మొక్కుబడిగా ప్రకటించడం, కాల్పుల విరమణ ప్రకటన చేయడానికి అమెరికాతో యూఏఈ సంప్రదింపులు జరిపినట్టు వార్తలు రావడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అంతే కాదు.. యూఏఈ దౌత్యం అద్భుతమంటూ పాక్ బహిరంగంగానే ప్రశంసించింది. భారత్‌కు మిత్ర దేశంగా ఉన్న యూఏఈ.. ఇలా భారత వ్యతిరేక చర్యలకు పాల్పడుతుంటే మోదీ సర్కారు ఏం చేస్తున్నదన్న వాదనలు పలువురు తెరమీదకు తీసుకొస్తున్నారు. ఇక, భారత్-పాక్ ఉద్రిక్తతలపై తొలుత చైనా స్పందిస్తూ.. తాము ఎల్లప్పుడూ ఉగ్రవాదానికి వ్యతిరేకమని స్పష్టం చేసింది. అయితే, కాల్పుల విరమణ తర్వాత మాత్రం.. పాక్‌కు అన్ని విషయాల్లో అండగా ఉంటామని ప్రకటించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకమన్న చైనా.. అదే ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌కు సపోర్ట్ చేయడమేంటి? దీన్ని మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా ఎందుకు అడ్డుకోలేకపోయింది? అనే సందేహాలను పలువురు దౌత్యవేత్తలు లేవదీస్తున్నారు. ఇక, 26 మంది ప్రాణాలు కోల్పోయిన పహల్గాం ఉగ్రదాడిపై ఏ మాత్రం స్పందించని భారత్ మరో మిత్ర దేశం కొలంబియా.. ఆపరేషన్ సిందూర్ కారణంగా పాక్‌లో జరిగిన ప్రాణనష్టంపై విలవిల్లాడిపోయింది. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని సంతాపం వ్యక్తం చేసింది. దీన్ని కూడా మోదీ ప్రభుత్వం తొలుత ఖండించలేదు. సర్వత్రా విమర్శలు రావడంతో శశిథరూర్ నేతృత్వంలోని బృందం కొలంబియాపై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో ఆ ప్రకటనను కొలంబియా వెనక్కి తీసుకొంది. మొత్తంగా ఈ పరిణామాలను విశ్లేషిస్తే.. పహల్గాం ఉగ్రదాడి విషయంలో అంతర్జాతీయ సమాజం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో మోదీ ప్రభుత్వం విఫలమయ్యిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పొరుగు దేశాలతోనూ అంతే..

11 ఏండ్ల పాలనలో ప్రధాని మోదీ విదేశాంగ విధానంలో, దౌత్య సంబంధాలను నెరపడంలో విఫలమయినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్‌కు పొరుగున ఉన్న దాదాపు అన్ని మిత్ర దేశాలూ ఇప్పుడు భారత్‌కు దూరమై చైనాకు అనుకూలంగా మారడాన్ని దీనికి ఉదాహరణగా చూయిస్తున్నారు. మాల్దీవుల్లో ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో భారత్‌కు వ్యతిరేకిగా పేరుపొందిన మహమ్మద్ ముయిజ్జు గెలిచి అధ్యక్షుడయ్యారు. చైనా నుంచి పెద్దయెత్తున రుణాలు వస్తుండటంతో వీలుచిక్కినప్పుడల్లా భారత్‌పై ఆయన విమర్శలు ఎక్కుపెడుతున్నారు. సరిహద్దు కయ్యాలతో భారత్‌లో ఉద్రిక్తతలకు కారణమవుతున్న పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌తో చైనా లోగుట్టు మైత్రీ బంధం బహిరంగ రహస్యమే. ఇక, బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వం, గతంలో చైనాతో సరిహద్దు వివాదాలను ఎదుర్కొన్న భూటాన్‌తో పాటు మారిషస్ కూడా చైనాలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వంతో ఇప్పుడు సత్సంబంధాల కోసం ఉవ్విళ్లూరుతున్నాయి. శ్రీలంకలో తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనుర కుమార దిసనాయకే మార్క్సిస్ట్ నేత. వెరసి భారత్ చుట్టూరా ఉన్న పొరుగు దేశాలన్నీ ఇండియాను కాదని చైనా స్నేహ హస్తాన్ని కోరుకొంటున్నాయి. దీంతో డ్రాగన్ కుయుక్తులను తిప్పికొట్టడంలో దౌత్యపరంగా మోదీ ఫెయిలయ్యారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నీట్ పీజీ వాయిదా

- వెల్లడించిన ఎన్‌బీఈఎంఎస్
- త్వరలోనే కొత్త తేదీ ప్రకటన
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు సింగిల్ షిఫ్ట్‌లోనే పరీక్ష

న్యూఢిల్లీ: ఈ నెల 15న జరగవలసిన నీట్-పీజీ, 2025ను వాయిదా వేసినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సోమవారం ప్రకటించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దీనిని ఒకే షిఫ్ట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపింది. పరీక్షార్థులందరికీ ఒకేసారి పరీక్షను నిర్వహించవలసి ఉండటం వల్ల పరీక్షా కేంద్రాల పెంపు, మౌలిక సదుపాయాలను సమకూర్చడం వంటివి అవసరమవుతాయని పేర్కొంది. సురక్షితమైన పరీక్షా కేంద్రాలను గుర్తించి, వాటిలో ఈ పరీక్షను పూర్తి పాదర్శకతతో నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపింది. ఈ పరీక్ష నిర్వహణకు సవరించిన తేదీని త్వరలోనే ప్రకటించనున్నట్లు పేర్కొంది. గతంలో ఈ పరీక్ష రెండు షిఫ్ట్‌లలో జరిగేది.

అన్నా వర్సిటీ రేప్ కేసు దోషికి జీవిత ఖైదు

చెన్నైలోని మహిళా కోర్టు తీర్పు

చెన్నై: నిరుడు తమిళనాట సంచలనం సృష్టించిన అన్నా యూనివర్సిటీలో జరిగిన లైంగిక దాడి కేసులో దోషికి చెన్నైలోని మహిళా కోర్టు సోమవారం జీవిత ఖైదు విధించింది. నమోదైన 11 అభియోగాలన్నీ రుజువైనందున దోషి జ్ఞానశేఖరన్‌కు ఎలాంటి రెమిషన్ లేకుండా కనిష్ఠంగా 30 ఏండ్ల పాటు శిక్ష అమలు చేయాలని ఆదేశించింది. దోషి తన కుటుంబంలో ఏకైక సంపాదనపరుడినని పేర్కొంటూ శిక్ష తగ్గింపునకు అభ్యర్థించాడని జడ్జి పేర్కొనగా.. ప్రాసిక్యూషన్ అందుకు అభ్యంతరం తెలిపి అతడికి గరిష్ఠంగా శిక్ష విధించాలని కోరింది. పాలక డీఎంకేతో దోషికి సంబంధాలున్నాయని గతంలో ఆరోపణలు రాగా.. సీఎం స్టాలిన్ వాటిని ఖండించారు. తాను తన స్నేహితుడితో కలిసి ఉన్నప్పుడు జ్ఞానశేఖరన్ బెదిరించి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించింది.

గుర్తింపు కార్డులు చూపాలని పట్టు పట్టొద్దు

▪ రేప్ బాధితులకు గర్భ స్రావంపై ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కోర్టు ఆదేశాల మేరకు గర్భ స్రావం చేయించుకొనే రేప్ బాధితులను గుర్తింపు కార్డులు చూపాలని పట్టు పట్టొద్దని, దర్యాప్తు అధికారి ఆమెను గుర్తిస్తే సరిపోతుందని ఢిల్లీ హైకోర్టు దవాఖానలను ఆదేశించింది. ఈ విషయంలో ముఖ్యంగా మైనర్ల విషయంలో స్పష్టమైన, ఆచరణాత్మక, సున్నిత వైద్య నియమాలను పాటించాలని కోరింది. గుర్తింపు పత్రాలు కావాలని పట్టు పట్టడం, వైద్య పరీక్షల నిర్వహణలో జాప్యం లాంటి కారణాల వల్ల బాధితురాలు మరింత దుఃఖానికి గురవుతారని ఓ రేప్ బాధితురాలి కేసు విచారణ సందర్భంగా గత నెల 29న కోర్టు వ్యాఖ్యానించింది. చట్టబద్ధ బాధ్యతలను నిర్వహించేటప్పుడు దయతో లైంగిక హింస బాధితుల సవాళ్లను అర్థం చేసుకొని వారికి వైద్యం చేయాలని కోర్టు సూచించింది.

ట్రక్కులలో దాచి.. అదును చూసి దాడి

అత్యంత పకడ్బందీగా 'ఆపరేషన్ స్పైడర్ వెబ్' ▪ రష్యా ఎయిర్‌బేస్‌లపై ఉక్రెయిన్ మెరుపుదాడి

ఉక్రెయిన్ ట్రక్కుల్లో దాచి రష్యాపై దాడికి ఉపయోగించిన డ్రోన్లు ఇవే

కీవ్, జూన్ 2: రష్యాలోని కీలక సైనిక స్థావరాలపై ఆదివారం ఉక్రెయిన్ 117 డ్రోన్లతో జరిపిన భారీ స్థాయి దాడి వెనుక 18 నెలల పక్కా ప్రణాళిక ఉంది. ట్రక్కులలో వేల కిలోమీటర్లు ప్రయాణించి రష్యా వైమానిక స్థావరాలకు అత్యంత సమీపం వద్దకు చేరుకున్న వందకుపైగా డ్రోన్లు రష్యాకు చెందిన ఐదు కీలకమైన వైమానిక స్థావరాలను బాంబులతో పేల్చివేశాయి. 'ఆపరేషన్ స్పైడర్ వెబ్' పేరుతో ఉక్రెయిన్ భద్రతా సర్వీసు ఎస్‌బీయూ ఈ దాడికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించడమే కాకుండా ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పక్కాగా అమలు చేసింది. ఉక్రెయిన్ ఉపయోగించిన ఫస్ట్ పర్సన్ వ్యూ(ఎఫ్‌పీవీ) డ్రోన్లు రష్యాలోని ముర్మన్స్క్, ఇర్కుత్స్క్, ఇవానోవో, రియాజన్, అమూర్ ప్రాంతాలలోని ఐదు వైమానిక స్థావరాలపై దాడి చేసినట్లు రష్యా ధ్రువీకరించింది. ఈ దాడులలో అనేక యుద్ధ విమానాలు దగ్ధమయ్యాయని రష్యా వెల్లడించింది. 2022లో రష్యా దురాక్రమణకు పాల్పడిన తర్వాత ప్రతిస్పందనగా ఉక్రెయిన్ పలుమార్లు రష్యాలోని లక్ష్యాలపై డ్రోన్ల దాడి జరిపింది. కాని ఈసారి మాత్రం ఉక్రెయిన్ ఉపయోగించిన పద్ధతి పూర్తి భిన్నమైనది. యుద్ధ ముప్పును ఎదుర్కొంటున్న దేశాలను ఆలోచింపచేసే రీతిలో ఇది ఉంది. ఏడాదిన్నర ప్రణాళిక తర్వాత ఈ డ్రోన్ల దాడిని అమలు చేసినట్లు ఎస్‌బీయూ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం భారీ వాహనాల అవసరం కీలకంగా మారింది. ముందుగానే రష్యాలోకి డ్రోన్లను అక్రమంగా తరలించడం జరిగింది. ట్రక్కులపై ఏర్పాటు చేసిన చెక్క క్యాబిన్లకు చెందిన పైకప్పు కింద డ్రోన్లను దాచి పెట్టినట్లు నిఘా వర్గాలు వివరించాయి. దాడి జరిపే సమయంలో రిమోట్ కంట్రోల్ ద్వారా క్యాబిన్ల పైకప్పు తొలగిపోయి డ్రోన్లు పైకి ఎగిరి సమీపంలోని తమ లక్ష్యాలను చేరుకున్నాయి. రవాణా కంటెయినర్లలో దాచిన నల్ల రంగు డ్రోన్లకు సంబంధించిన ఫొటోలను ఎస్‌బీయూ షేర్ చేసింది. తాజా దాడిని రష్యా పెరల్ హార్బర్ దాడిగా అభివర్ణిస్తున్నారు. ఈ దాడి సమన్వయం కోసం రష్యా ఇంటెలిజెన్స్ కార్యాలయం పక్కనే ఉక్రెయిన్ గూఢచారులు కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటుచేసుకోవడం గమనార్హం.

రష్యా గడ్డపై నుంచే ప్రయోగం

ఉక్రెయిన్ నుంచి ఈ డ్రోన్లను ప్రయోగించలేదని, వీటిని తమ వైమానిక స్థావరాలకు అత్యంత సమీపంలో నుంచే ప్రయోగించారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ధ్రువీకరించడం ఉక్రెయిన్ చేస్తున్న వాదనకు బలం చేకూరుస్తున్నది. ఇర్కుత్స్క్ ఓబ్లాస్ట్‌లోని బలయా ఎయిర్‌బేస్ ఉక్రెయిన్ సరిహద్దు నుంచి 4,300 కిలోమీటర్లు ఉంటుంది. ముర్మన్స్క్ ఓబ్లాస్ట్‌లోని ఒలేన్యా ఎయిర్‌బేస్ నుంచి 2,000 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రెండు ఎయిర్‌బేస్‌ల నుంచి దగ్ధమవుతున్న రష్యా యుద్ధ విమానాలకు చెందిన దట్టమైన నల్లని పొగ వెలువడుతున్న దృశ్యాలను కూడా ఎస్‌బీయూ షేర్ చేసింది.

డ్రోన్లకు ముందువైపు కెమెరాలు

బాంబులు అమర్చిన 100కిపైగా ఎఫ్‌పీవీ డ్రోన్లను ముందుగానే రష్యాలోకి తరలించామని ఎస్‌బీయూ చీఫ్ వాసిలీ మాలియుక్ వెల్లడించారు. చిన్న సైజులో ఉండే ఈ డ్రోన్లకు ముందు వైపున కెమెరాలు అమర్చి ఉంటాయి. వీటిని ఆపరేట్ చేసే వ్యక్తి లైవ్ వీడియో చూడవచ్చు. ఎక్కడో మారుమూల ఉండి దీన్ని ఆపరేట్ చేసే వ్యక్తి కచ్చితత్వంతో లక్ష్యంపై దాడి చేసే అవకాశం పూర్తిగా ఉంటుంది. కాగా, ట్రక్కులను నడుపుతున్న వ్యక్తులకు తాము రవాణా చేస్తున్న దేమిటో తెలిసే అవకాశం కూడా ఉండదని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. 2022లో కూడా ఇదే రకమైన ఆపరేషన్ జరిగిందని, లారీలో రహస్యంగా తరలిస్తున్న బాంబు క్రిమియా, రష్యాను కలిపే కెర్చ్ వంతెనను పేల్చివేసిందని వారు గుర్తు చేశారు. డ్రోన్ల దాడికి ఉక్రెయిన్ వేసిన ఎత్తుగడ చాలా వినూత్నమైనదని, వేరే చోట వైమానిక దాడులు జరుపుతున్నట్లు దృష్టి మళ్లించి రష్యా తన యుద్ధ విమానాలను ఒక చోటుకు తరలించేలా ఉక్రెయిన్ ప్రణాళిక వేసి విజయం సాధించిందని వారు తెలిపారు. ఒలేన్యా వైమానిక స్థావరానికి డజన్ల సంఖ్యలో రష్యా యుద్ధ విమానాలను మూడు రోజుల క్రితమే తరలించిందని, జూన్ 1న జరిగిన డ్రోన్ల దాడిలో తీవ్రంగా నష్టపోయింది ఇక్కడేనని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఉక్రెయిన్-రష్యా చర్చలు విఫలం

సోమవారం ఇస్తాంబుల్ వేదికగా కాల్పుల విరమణపై ఉక్రెయిన్-రష్యా మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఉక్రెయిన్‌తో బేషరతు కాల్పుల విరమణకు రష్యా నిరాకరించింది. ఇరు దేశాల మధ్య యుద్ధం భీకర రూపం దాల్చినవేళ ఇస్తాంబుల్ శాంతి చర్చలు కీలకంగా మారాయి. సోమవారం తుర్కియేలో ఇరు దేశాల ప్రతినిధుల మధ్య గంటపాటు శాంతి చర్చలు జరిగినట్టు కీవ్ రాయబారులు తెలిపారు.

భారత్‌కు బ్రహ్మపుత్రను ఆపేస్తాం!

పాక్‌కు మద్దతుగా భారత్‌కు చైనా హెచ్చరిక

బీజింగ్: నీటి పంపకంపై భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్‌కు మద్దతుగా చైనా భారత్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. భారత్‌లోకి బ్రహ్మపుత్ర నదీ ప్రవాహాన్ని చైనా అడ్డుకోగలదని సెంటర్ ఫర్ చైనా అండ్ గ్లోబలైజేషన్ ఉపాధ్యక్షుడు విక్టర్ జికాయ్ గవో సోమవారం బీజింగ్‌లో ప్రకటించారు. పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందంపై భారత్ వైఖరి పట్ల ఆయన ఇండియా టుడేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతరుల పట్ల తాము ఎలా వ్యవహరిస్తామో తమ పట్ల కూడా ఇతరులు అలాగే వ్యవహరిస్తారు అని గ్రహించాలని ఆయన పేర్కొన్నారు. చైనా మిత్రుడైన పాకిస్థాన్‌కు నీరు రాకుండా భారత్ అడ్డుకుంటే భారత్‌లోకి నీరు ప్రవహించకుండా చైనా కూడా అడ్డుకోగలదని ఆయన హెచ్చరించారు. భారతదేశ జల భద్రతకు అత్యంత ముఖ్యమైనదైన బ్రహ్మపుత్ర నది నియంత్రణ తమ పరిధిలో ఉందని విక్టర్ గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై చేపట్టిన ప్రతీకార చర్యలలో భాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంపై విక్టర్ స్పందిస్తూ భారత్ నుంచి నదులు పాక్‌లోకి ఎలా ప్రవహిస్తాయో చైనా నుంచి కూడా నదులు భారత్‌లోకి ప్రవహిస్తాయని వ్యాఖ్యానించారు. సర్వ కాలాలలో తమకు అత్యంత ఆప్త మిత్రుడైన పాకిస్థాన్‌కు మద్దతుగా బ్రహ్మపుత్ర నదీ జలాలను భారత్‌పైకి అస్త్రంగా చైనా వాడుకుంటుందని ఆయన చెప్పారు. ఇతరులకు వ్యతిరేకంగా భారత్ చర్యలు తీసుకుంటే అందుకు వచ్చే ప్రతిస్పందనలకు కూడా భారత్ సిద్ధంగా ఉండాల్సి ఉంటుందని, ఆ ప్రతిస్పందనలు భారత్‌లో పెను సవాళ్లకు దారి తీయగలవని ఆయన హెచ్చరించారు.

2026లోగా భారత్‌కు మిగతా
ఎస్-400క్షిపణి వ్యవస్థలు

న్యూఢిల్లీ, జూన్ 2: ఆపరేషన్ సిందూర్‌లో తన శక్తిసామర్థ్యాలు ప్రదర్శించిన క్షిపణి రక్షణ వ్యవస్థ 'ఎస్-400'కు సంబంధించి రష్యా కీలక ప్రకటన చేసింది. వీటికి సంబంధించి భారత్‌కు ఇవ్వాల్సిన మిగిలిన రెండు యూనిట్లను 2026లోగా అందజేసేందుకు కట్టుబడి ఉన్నామని రష్యా అధికారి రోమన్ బాబుష్కిన్ సోమవారం చెప్పారు. భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ వీటి పనితీరు చాలా బాగుందని అన్నారు. గగనతల రక్షణ, యాంటీ డ్రోన్ సిస్టంపై భారత్‌తో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించాలని అన్నారు.

ఒక్కసారిగా బద్దలైన అగ్నిపర్వతం

ఇటలీలోని మౌంట్ ఎట్నా అగ్ని పర్వతం సోమవారం ఒక్కసారిగా బద్దలైంది. భారీ ఎత్తున బూడిద వెలువడటంతో పర్యాటకులు భయాందోళనతో పరుగులు తీశారు. పర్యాటకులను, సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు.

అమెరికా వీసా కోసం ఏడాదికి పైగానే నిరీక్షణ

- విద్యార్థులే కాదు, వ్యాపార, పర్యాటక, ఇతర రంగాల వారికీ తప్పని పరిస్థితి
- రీషెడ్యూలింగ్ మరింత కఠినతరం

న్యూఢిల్లీ: అమెరికా వీసా కలను సాకారం చేసుకోవడానికి ఏడాదికిపైగానే వేచి చూడవలసి వస్తున్నది. ఈ పరిస్థితి విద్యార్థులకు మాత్రమే కాదు, వ్యాపారులు, పర్యాటకులు వంటి ఇతర రంగాల వారికీ ఎదురవుతున్నది. కొన్ని ప్రాంతాల్లో అపాయింట్‌మెంట్ వెయిట్ టైమ్ ఓ సంవత్సరానికి మించిపోతున్నది. రీషెడ్యూలింగ్ మరింత కఠినమవుతున్నది. ఇక ఇంటర్వ్యూలు అత్యంత సూక్ష్మ వివరాలతో, కఠినతరమయ్యాయి. దేశంలోని పశ్చిమ ప్రాంతాల వారికి వీసా అపాయింట్‌మెంట్ దొరకాలంటే ఏడాదిన్నర పడుతున్నది లేదా 2026 చివరికి పోతున్నది. దేశంలోని ఉత్తరాది, దక్షిణాది, తూర్పు ప్రాంతాల వారికి దాదాపు ఓ సంవత్సరంలో అపాయింట్‌మెంట్ దొరుకుతున్నది.

ఒకసారి మాత్రమే రీషెడ్యూల్

మే నెల నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం, అమెరికా వీసా కోసం దరఖాస్తుదారు తనకు కేటాయించిన సమయానికి హాజరుకాలేకపోతే, కొత్త అపాయింట్‌మెంట్‌ను 120 రోజుల వరకు బుక్ చేసుకోవడానికి వీలుకాదు. ఇది ఇంటర్వ్యూకు, ఇంటర్వ్యూ-వెయివర్ అపాయింట్‌మెంట్స్‌కు వర్తిస్తుంది. జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు తమ అపాయింట్‌మెంట్‌ను కేవలం ఒకసారి మాత్రమే రీషెడ్యూల్ చేసుకోవచ్చు. గతంలో రెండుసార్లు రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉండేది.

ప్రభుత్వం జోక్యం లేకపోవడమే ఇబ్బందికరం

ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ, అపాయింట్‌మెంట్ జాప్యాలు కొవిడ్-19 మహమ్మారి తర్వాత నుంచి సాధారణమేనని, అయితే, ఇప్పుడు ఈ గడువు ఓ ఏడాదికి మించిపోతున్నదని చెప్పారు. జనవరికి పూర్వం 8-9 నెలలు లేదా ఒక సంవత్సరం పట్టేదని, ఒక ఏడాది లోగా వీసా వచ్చేదని తెలిపారు. ఇప్పుడు ఈ గడువు ఏడాదికి మించిపోతున్నదని, తిరస్కరణలు కూడా పెరిగిపోతున్నాయని చెప్పారు. అన్ని రకాల ధ్రువపత్రాలు ఉన్న దరఖాస్తుదారులకు కూడా వ్యాపారం, లీజర్ వీసాల తిరస్కరణ జరుగుతున్నదన్నారు. అమెరికాకు తప్పనిసరిగా వెళ్లవలసిన వారు భారత్‌లో వీసా అపాయింట్‌మెంట్లు దొరకపోవడంతో సింగపూర్, థాయ్‌లాండ్ వెళ్లి, అక్కడి నుంచి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. చైనా వంటి దేశాల్లో ఇటువంటి జాప్యాల గురించి తాము వినలేదని, చైనాలో కొద్ది వారాల్లోనే అపాయింట్‌మెంట్లు దొరుకుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకోనందువల్ల తాము నిస్సహాయులమైపోతున్నామని తెలిపారు.

ఆ రోజులు పోయాయి

కొత్త వీసాలు రావడం సవాలుగా మారిపోయిందని ట్రావెల్స్ ఏజెంట్లు చెప్పారు. పర్యాటకులు వీసా రాకముందే ట్రావెల్స్ వద్ద అమెరికా ట్రిప్‌ను బుక్ చేసుకుని, ఓ నెలలోనే అమెరికా వెళ్లే రోజులు పోయాయన్నారు. అనైతిక ఏజెంట్లపై అమెరికన్

V